క్లుప్తంగా

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 21వ తేదీ వరకు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. శిక్షణ శిబిరంలో పిల్లలకు కరాటే, యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, క్రాఫ్ట్, డ్రాయింగ్ వంటి పలు అంశాలను బోధించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శారదబాయి మాట్లాడుతూ వేసవి సెలవులను పిల్లలు క్రమశిక్షణతో వినియోగించుకున్నారని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు.

కుట్టుమిషన్ అందజేత

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ బొగ్గారపు రామకృష్ణ ఆధ్వర్యంలో నిరుపేద మహిళ ధనలక్ష్మికి బుధవారం కుట్టు మిషన్ అందజేశారు. కార్యక్రమంలో పాక విజయకుమార్, సత్యనారాయణ, రంగాచారి, బుచ్చాచారి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



వరంగల్ చౌరస్తా: వరంగల్ దేశాయిపేట 13వ డివిజన్‌కు చెందిన పోలెపాక రామారావు ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబానికి సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఎలుకపెల్లి శ్రీధర్ బుధవారం ఆర్థికసాయం చేశారు. 25 కిలోల బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు, దేవునూరి రాజు, ఎలుకపెల్లి హర్షిత్, శాన్వి పాల్గొన్నారు.

25న జీపీఓ పరీక్ష

హన్మకొండ అర్బన్: ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పాలన అధికారి పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న వీఆర్ఓ, వీఆర్ఏలకు ఈనెల 25న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నారు. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ చర్చి కాంపౌండ్ స్కూల్‌లో ఉదయం 10.30కు పరీక్ష ఉంటుంది. హనుమకొండ జిల్లాలో 168 ఖాళీలు ఉండగా, 132 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. జేఎన్టీయూ నిర్వహిస్తున్న ఈ పరీక్షలో అర్హత సాధించిన వారు గ్రామపాలన అధికారులుగా(జీపీఓ) విధులు నిర్వహించనున్నారు.

ప్రతిభా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: పదో తరగతిలో 560, ఆపై మార్కులు సాధించిన రజక విద్యార్థులకు ప్రతిభా అవార్డులు అందించనున్నట్లు రజక ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఉల్లెంగుల కొమురెల్లి, ప్రధాన కార్యదర్శి పంతంగి సమ్మయ్య, గౌరవ సలహాదారు దశపతి తెలిపారు. విద్యార్థుల మార్కుల మెమో, హెచ్ఎంల ధ్రువీకరణతోపాటు నివాస ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోను 94414 54284, 94918 21598 నంబర్లకు వాట్సాప్ ద్వారా ఈనెల 28వ తేదీలోపు పంపాలని కోరారు.

చేయూత హర్షణీయం

కాజీపేట: దివ్యాంగులు ఇద్దరు పెళ్లి చేసుకుంటే ఆర్థిక సాయం మంజూరు చేయడం హర్షించదగిన విషయమని దివ్యాంగుల సంక్షేమ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఇప్ప శ్రీకాంత్ అన్నారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో బుధవారం జరిగిన దివ్యాంగుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 ఏళ్ల పోరాట ఫలితంగా దివ్యాంగులకు ప్రభుత్వ చేయూత అభినందనీయమని కొనియాడారు. ఈ సమావేశంలో చల్ల మహేందర్ రెడ్డి, డి.వెంకటేష్, చట్ల మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ డీమార్ట్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వృద్ధుడు గుండెపోటుకు గురై మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం బుధవారం 11 గంటల సమయంలో రహదారిపై చేతిలో సంచీతో నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి ఆకస్మాత్తుగా కిందపడిపోయి తుది శ్వాస విడిచాడు. స్థానికులు సీపీఆర్ చేయడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సుమారు 60 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. వివరాలకు 87126 85122, 87125 09781 నంబర్లలో సంప్రదించాలని సీఐ సుధాకర్ రెడ్డి సూచించారు.

హమాలీ యూనియన్ ఎన్నిక

హసన్‌పర్తి: సీఐటీయూ హమాలీ యూనియన్ బైరాన్‌పల్లి శాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా జక్కుల స్వామి, ఉపాధ్యక్షులుగా కాగితాల నరసింహాస్వామి, జక్కుల ఓదెలు, జక్కుల రఘుపతి, జక్కుల కుమార్, మేకల దీకొండ సదానందం, కల్లబోయిన దేవేందర్, రాజ్‌కుమార్, రవి ఎన్నికయ్యారు.

అడుగడుగునా నీటిచౌర్యం

- కాజీపేటలో మోటార్లతో తోడేస్తున్న వైనం
- నగరపాలక సంస్థ ఆదాయానికి గండి
- ఇబ్బందులు పడుతున్న సామాన్యులు
- పలు కాలనీలకు ట్యాంకర్ నీరే ఆధారం



నల్లాకు అక్రమంగా బిగించిన మోటారు

కాజీపేట: అధికారుల నిర్లక్ష్యం.. పట్టింపులేనితనం వల్ల పట్టణంలో అక్రమనీటి చౌర్యం ఎక్కువైంది. దీంతో ఎగువ ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం వెంపర్లాడాల్సిన దుస్థితి నెలకొంది. నల్లాల ద్వారా కార్పొరేషన్ అధికారులు నీటి సరఫరాను ప్రారంభించడమే ఆలస్యం అన్నట్లుగా మోటార్లను ఆన్ చేసి నీటిని ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. మోటార్ల ప్రభావంతో సామాన్యులు నీటిఎద్దడి ఎదుర్కొంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నీటి అక్రమ చౌర్యాన్ని అరికట్టలేని దయనీయ స్థితిలో అధికార యంత్రాంగం ఉండడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ట్యాంకర్ నీరే పెద్దదిక్కుగా మారింది. వేసవి ఎండలు మండిపోతుండటంతో తాగునీరు దొరకక్క ప్రజలు తల్లడిల్లుతున్నారు. నిత్యం 40 ట్రిప్పులకుపైగా తాగునీటి ట్యాంకర్లు పలు కాలనీలకు నీటిని సరాఫరా చేస్తున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

250పైగా అక్రమ కనెక్షన్లు

పట్టణంలో 250కిపైగా అక్రమ కనెక్షన్లు ఉన్నట్లు అంచనా. బహుళ అంతస్తులతో పాటు సాధారణ ఇళ్లలో ఇంటికో మోటారు ఉంది. ఈ చర్యల వల్ల నీరు దుర్వినియోగం కావడంతోపాటు కృత్రిమ నీటి కొరత ఏర్పడుతోంది. అలాగే, నగరపాలక సంస్థ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. పట్టణంలోని ప్రతీ వీధిలోనూ ఈ తరహా అక్రమాలు జరుగుతున్నా అధికారులు గట్టిగా ప్రశ్నించి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

కాజీపేటలోనే సుమారు 500 మోటార్లు

కాజీపేట పట్టణంలోనే దాదాపు 500లకుపైగా గృహాల్లో మోటార్లు వినియోగిస్తుంటారని అధికారులు అంచనాలు వేసినా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తమకేమీ పట్టనట్లుగా దూరంగా ఉంటున్నారనేది ఎవరూ కాదనలేని సత్యం. మోటార్లతో తాగునీటిని దొంగలిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోందని విష్ణుపురి, తిలక్‌నగర్, న్యూ సోమిడి, దర్గా కాజీపేట, ఇంపీరియల్ కాలనీ, తదితర కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మోటార్ల ద్వారా నీటిని అక్రమంగా తోడుకుంటున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఆకస్మిక దాడులు నిర్వహించాలి



నల్లాల ద్వారా తాగునీటిని వదిలిన కొద్దిసేపటికే మున్సిపల్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలను చేపట్టాలి. పరిమితికి మించి అక్రమంగా నీటిని తోడుకుంటున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయాలి. ఆ మోటార్లను అధికారులు స్వాధీనం చేసుకోవాలి.

- కుమ్మరి రాజ్‌కుమార్, సోమిడి

ప్రత్యేక సిబ్బందిని నియమించాలి



నిబంధనలకు విరుద్ధంగా నీటిని వినియోగిస్తున్న వ్యక్తుల ఆటలు కట్టించడానికి ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తనిఖీలు చేసి భారీ స్థాయిలో జరిమానాలు విధించాలి.

- ఎండీ.సయ్యద్, కాజీపేట

ప్రపంచాన్ని కదిలించిన రైతాంగ పోరాటం

- రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్



సీడీ ఆవిష్కరిస్తున్న చంద్రకుమార్, తదితరులు

వరంగల్ చౌరస్తా: దేశవ్యాప్తంగా జరిగిన రైతాంగ పోరాటం ప్రపంచాన్ని కదిలించిందని, రైతు వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోకతప్పలేదని రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ అన్నారు. వరంగల్ అబ్బనికుంటలో తెలంగాణ రైతు సంఘం భవనంలో సంఘ అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం సభ నిర్వహించారు. రైతులను చైతన్య పరచడానికి, రైతు హక్కులను కాపాడుకోవడానికి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన షార్ట్ ఫిలిం సీడీని చంద్రకుమార్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యక్షంగా, పరోక్షంగా నేటికీ 75 శాతం మందికి ఉపాధినిస్తున్న వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేయబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయం ఆధారిత పరిశ్రమలు కూడా నష్టాల్లో కూరుకుపోయి మూతపడుతున్నాయని వాపోయారు. ఫలితంగా లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు నిరుద్యోగులుగా మారిపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీడీ డైరెక్టర్ అల్లాపురం దామోదర్, నాయకులు ఓదెల రాజన్న, ఈర్ల పైడి, హుస్సేన్, ఊరటి అంశాల రెడ్డి, పుచ్చకాయల బుచ్చిరెడ్డి, దామోదర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, నల్ల విజేందర్, సిరుల రవీందర్, మోకిడి పేరయ్య, జెండా అంబయ్య, సోమిడి సాంబయ్య, బరుపటి రవీందర్, తోట రాజేందర్ పాల్గొన్నారు.

అదుపులో చోరీ నిందితుడు

రెండు బైక్‌లు, 4.5గ్రాముల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

హసన్‌పర్తి: వివిధ ప్రాంతాల్లో బైక్‌తోపాటు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో అతడు పట్టుబడ్డాడు. కాకతీయ యూనివర్సిటీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివరాల ప్రకారం హుజూరాబాద్ జిల్లా ఇప్పల నర్సింగాపూర్‌కు చెందిన గోవిందుల కుమారస్వామి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈక్రమంలో జల్సాలకు అలవాటుపడి హసన్‌పర్తి, ఎల్కతుర్తి, వేలేరు, వంగర, కాజీపేట, పోలీస్‌స్టేషన్ పరిధిల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. నిందితుడి వద్ద నుంచి 4.5గ్రాముల బంగారం, రెండు బైక్‌లు సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. సమావేశంలో కేయూసీ ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఉపన్యాసం వీక్షించిన ఇగ్నో సిబ్బంది



కేంద్ర మంత్రి ఉపన్యాసాన్ని వీక్షిస్తున్న ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు, ఇగ్నో సిబ్బంది, విద్యార్థులు

రామన్నపేట: ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) ఆధ్వర్యంలో ఢిల్లీలో బుధవారం నిర్వహించిన 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' అనే అంశంపై కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రత్యేక ఉపన్యాసం దేశవ్యాప్తంగా జ్ఞాన్ దర్శన్ టీవీ ఛానల్, పలు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ ఉపన్యాసాన్ని ఇగ్నో హైదరాబాద్ రీజినల్ సెంటర్ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ కె.రమేష్, అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ బొల్ల రాజు, వరంగల్ అధ్యయన కేంద్రం నుంచి లాల్‌బహదూర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు, ఇగ్నో సిబ్బంది వీక్షించారు. కార్యక్రమంలో వరంగల్ ఇగ్నో స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ ఎస్వీ రమణారెడ్డి, ఇగ్నో సిబ్బంది, అకడమిక్ కౌన్సిలర్లు కందగట్ల శ్రవణ్ కుమార్, తిలక్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్



నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

ఖిలా వరంగల్: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్‌శాఖ ఇన్‌స్పెక్టర్ కె.రాజు తెలిపారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కొత్తపెల్లి గ్రామానికి చెందిన గండికోట వెంకటేశ్వర్లు.. మహారాష్ట్ర నుంచి ఎండు గంజాయి తీసుకొచ్చి శివనగర్‌లో విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ రాజు ఆధ్వర్యంలో బుధవారం దాడి చేసి నిందితుడు గండికోట వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసి అతడి నుంచి 300 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. దాడుల్లో ఎస్సై కబీర్‌దాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

వరంగల్ అర్బన్/రామన్నపేట: తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం ఆవిర్భవించి మే 31వ తేదీతో 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హైదరాబాద్ జల విహార్‌లో నిర్వహించనున్న సంబురాలను విజయవంతం చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్ –143) వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోరుకొప్పుల నరేందర్, వాంకిడి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు మిట్ట నవనీత్, నీలం శివ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో టీజేఎఫ్ రజతోత్సవ సంబురాల వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్, జాతీయ కార్యవర్గ సభ్యుడు మచ్చిక అరుణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి రాపెల్లి ఉపేందర్, తౌటి కామేశ్వర్, నరేష్, డానియల్, అల్లం రాజేష్ వర్మ, ఉమేందర్, బండి రవి, ఎండీ.అమీర్, భూసారపు వెంకటేశ్వర్లు, గిరగాని శ్రీనివాస్, సుధాకర్, వనం భాస్కర్, అర్షం సదానందం, బండి రాజు, ప్రభాకర్, కృష్ణ, చందు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టీ అమ్ముకునే మహిళపై దాడి

ఖిలా వరంగల్: టీ స్టాల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్న ఓ నిరుపేద మహిళలపై మద్యం మత్తులో ఓ వ్యక్తి దాడి చేసిన సంఘటన ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లో బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ పడమరకోటకు చెందిన మియాపురం ఝాన్సీ.. పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద టీ డబ్బా పెట్టుకొని తన భర్త, ఇద్దరు పిల్లలను సాకుతోంది. ఆ టీ డబ్బాను ఎలాగైనా దక్కించుకోవాలని కాంపెల్లి అమర్ తరుచూ మద్యం తాగివచ్చి ఝాన్సీతో దుర్భాషలాడే వాడు. రెండు నెలల క్రితం ఆ మహిళపై అమర్ దాడి చేయగా బాధితురాలు మిల్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మళ్లీ బుధవారం మద్యం తాగి వచ్చి టీ విక్రయిస్తున్న సదరు మహిళపై దాడి చేయగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకుని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు ఝాన్సీ తెలిపింది.

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి



స్ఫూర్తి కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ

విద్యారణ్యపురి: ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులు టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాయాలని వరంగల్ డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ కోరారు. వరంగల్, ఖిలా వరంగల్ మండలాల విద్యార్థులకు మట్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలా చదివి సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులు కావాలో ఆయన పలు సూచనలు చేశారు. ఏసీజీ కె.అరుణ, స్ఫూర్తి కార్యక్రమం ఇన్‌చార్జ్ మల్లారెడ్డి, ఎంఈఓ గంప అశోక్‌కుమార్, హెచ్ఎం వెంకన్న, ఉపాధ్యాయుడు దేవులపల్లి కిరణ్ పాల్గొన్నారు.

వేసవి శిబిరం పరిశీలన

మట్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 15 రోజులుగా నిర్వహిస్తున్న శిబిరం బుధవారం ముగిసింది. శిబిరాన్ని డీఈఓ పరిశీలించారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

హన్మకొండ అర్బన్: పద్మాక్షిరోడ్డులోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం నుంచి బాలాంజనేయ దేవాలయం మీదుగా చౌరస్తా వరకు, తిరిగి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వరకు శోభాయాత్ర బుధవారం జరిగినట్లు ఆలయ అర్చకుడు ఆరుట్ల రామాచార్యులు తెలిపారు.

కాజీపేటలో అంజన్న భక్తుల ర్యాలీ

కాజీపేట: జూబ్లీమార్కెట్ ఆవరణలోని అభయాంజనేయ స్వామి దేవాలయం భక్తులు పట్టణంలో బుధవారం రాత్రి ఆంజనేయుడి భారీ విగ్రహంతో ఆలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు.

నేడు హనుమాన్ జయంతి

హన్మకొండ కల్చరల్: హనుమాన్ జయంతి సందర్భంగా వేయిస్తంభాల దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు దేవాలయ ఈఓ అనిల్‌కుమార్, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

టీటీడీ ఆధ్వర్యంలో..

హన్మకొండ కల్చరల్: టీటీడీ దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి ఉత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు టీటీడీ డీపీపీ జిల్లా బాధ్యుడు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు.

భూత వైద్యురాలి ఇంటిపై దాడి



ఖిలా వరంగల్: భూత వైద్యం సరిగా పనిచేయలేదని ఓ భూత వైద్యురాలి ఇంటిపై ఓ వ్యక్తి దాడి చేసిన సంఘటన వరంగల్ 36వ డివిజన్ చింతల్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన సల్మా.. భూత వైద్యురాలిగా పనిచేస్తోంది. ఓ వ్యక్తి అనారోగ్యానికి గురికాగా, ఇటీవల సల్మాను సంప్రదించాడు. భూత వైద్యంతో ద్వారా బాగు చేస్తానని ఆమె భరోసా ఇచ్చి వైద్యం చేసింది. ఆ భూత వైద్యం పనిచేయలేదని ఆగ్రహానికిలోనైన బాధితుడు.. ఆమె ఇంటిపై దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేశాడు. సల్మా వెంటనే 100కు డయల్ చేయగా ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



హనుమకొండ డీసీసీ భవన్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు



హసన్‌పర్తి: రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, తదితరులు



మడికొండలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాజీపేట చౌరస్తాలో..



వరంగల్ కూరగాయల మార్కెట్‌లో..

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని నగర వ్యాప్తంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు కాంగ్రెస్ నేతలు, నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను కొనియాడారు.

- సాక్షి నెట్‌వర్క్

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, నాగరాజు



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యేలు

హన్మకొండ అర్బన్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని తలసేమియా బాధిత చిన్నారుల కోసం ఇండియన్ యూత్ కాంగ్రెస్, వరంగల్ అర్బన్, హనుమకొండ జిల్లా యూత్ ప్రెసిడెంట్ కేఆర్.దిలీప్‌రాజ్ ఆధ్వర్యంలో హనుమకొండ రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదాతలను అభినందిస్తూ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం వారు తలసేమియా బాధిత చిన్నారులను పరామర్శించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవీ.శ్రీనివాస్‌రావు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ అశ్విని రాథోడ్, వరంగల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎండీ.నేహాల్, వర్ధన్నపేట యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు పవన్, చైతన్యరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రక్తదాతలు, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో చేర్పించండి



కరపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

న్యూశాయంపేట: నాణ్యమైన విద్యను అందిస్తున్న మైనార్టీ గురుకులాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని టెమ్రిస్ అకడమిక్ కోఆర్డినేటర్ రుహీనా అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శిరీష, అధ్యాపకులు కలిసి హనుమకొండ ఈద్గా, లష్కర్‌బజార్, బొక్కలగడ్డ తదితర ప్రాంతాల్లో బుధవారం కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. గురుకులాల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అయిషా, యాస్మిన్, షబానా, పద్మ, సర్వర్ మొహియొద్దీన్, సుల్తాన్, అమీర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించండి



నాలాను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ నుంచి రైల్వే ప్రాంతం వరకు ఉన్న డ్రెయినేజీ, కల్వర్టు సమస్యను రైల్వే, మున్సిపల్ అధికారులు పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం కురిసిన వర్షానికి మురుగునీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రైల్వే అధికారులు, మున్సిపల్ అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు కలిసి డ్రెయినేజీ కల్వర్టును బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, మున్సిపల్ అధికారులు, నాయకులు మైసారపు సిరిల్‌లారెన్స్, షేక్ అజ్గర్, సిరిల్‌లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, దొంగల కుమార్, పోగుల శ్రీనివాస్, మాతంగి స్వామి, శరత్ పాల్గొన్నారు.

బుద్ధవిహారం నిర్మించాలని వినతి



బౌద్ధబిక్షువుకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే

విద్యారణ్యపురి: రాజమండ్రి నుంచి వరంగల్‌కు వచ్చిన బౌద్ధబిక్షువు, బౌద్ధ ఉపాసకుడు అనాలియా బంతే బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ నగరంలో బుద్ధవిహారం నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనుకూలమైన చోట బుద్ధవిహారం నిర్మించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల బాధ్యులు సందీప్, కొంగర జగన్మోహన్, మిద్దపాక ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, బండ అశోక్, బందుల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.